క్లుప్తంగా

ఎస్పీ బాలుకు నివాళి



నగరంపాలెం: గాన గంధర్వుడు ఎస్పీ బాల సుబ్రహ్మణ్యం ఐదో వర్ధంతిని గురువారం నాజ్ కూడలిలోని బాలు కాంస్య విగ్రహం వద్ద నిర్వహించారు. కళాదర్బార్ అధ్యక్షుడు పొత్తూరి రంగారావు, సేవా సదన్ అధ్యక్షుడు మిరియాల గోపీకుమార్ సంయుక్త ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. బాలు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బాలు ఎదిగిన తీరు, ఆయన అలపించిన గీతాలను స్మరించుకున్నారు. కార్యక్రమంలో సేవా సంస్థ ప్రతినిధులు, గాయకులు యశోదకృష్ణ, జొన్నలగడ్డ వెంకటరత్నం, రాజశేఖర్, డేగల వెంకటేశ్వరరావు, అబ్దుల్ ఖాదర్, కె.బాబురావు, ఎస్.కోటేశ్వరరావు, కృపావరం, ఉపేందర్‌సింగ్, సత్తార్, మాతృశ్రీ విద్యాసంస్థల డైరక్టర్ బండ్లమూడి గాంధీ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కొరిటిపాడు(గుంటూరు): 11 కేవీ లైన్‌లో చెట్ల కొమ్మలు తొలగించడం, డీటీఆర్ ఏబీ స్విచ్‌లు బాగు చేసుకునే పనులు ఉన్నందున చంద్రమౌళీనగర్, లక్ష్మీపురం మెయిన్ రోడ్ తదితర ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నారు. ఈ మేరకు టౌన్-2 డీఈఈ ఎస్.గురవయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

అవినీతి రహిత సమాజం అందరి బాధ్యత



కొరిటిపాడు(గుంటూరు): సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో గురువారం ఆ బ్యాంక్ ప్రాంతీయ కార్యాలయం బొమ్మిడాల కాంప్లెక్స్ ఆదాయపు పన్ను భవనం నుంచి విజిలెన్స్ అవగాహన ర్యాలీ నిర్వహించారు. బ్యాంకు కడప రీజియన్ రీజినల్ హెడ్ ఇ.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ... అవినీతి రహిత సమాజం అందరి బాధ్యత అని పేర్కొన్నారు. అవినీతి లేని సమాజం కోసం ప్రతి ఒక్కరూ పాటుపడాలని సూచించారు. కార్యక్రమంలో బ్యాంక్ చీఫ్ మేనేజర్లు బీకే ప్రసాద్, రాకేష్, హెచ్‌బీ రంజన్, అంజనా, విజిలెన్స్ అధికారి రాజన్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

మానసిక దివ్యాంగుడు అదృశ్యం




లక్ష్మీపురం: మానసిక దివ్యాంగుడు అదృశ్యమైనట్లు గురువారం అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శారదాకాలనీ ప్రాంతానికి చెందిన మద్దెల శ్రీరామ్ మూగ, మానసిక దివ్యాంగుడు. శుక్రవారం ఉదయం ఇంటి ముందు కూర్చున్నాడు. కాసేపటి తర్వాత చూస్తే కనిపించలేదని కుటుంబసభ్యులు చుట్టు పక్కల వెతికారు. ఆచూకీ లభించకపోవడంతో తండ్రి కోటయ్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఆచూకీ తెలిస్తే 0863-2231955, సీఐ ఆరోగ్య రాజు - 86888 31332 ఫోను నంబర్లకు సమాచారం అందించాలని పోలీసులు కోరారు.

పని గంటల పెంపుపై నిరసన



లక్ష్మీపురం: రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం పది గంటల పని విధానాన్ని తీసుకురావడం దుర్మార్గమని, దానిని నిరసిస్తూ టింబర్ ముఠా కార్మికులు గురువారం కలప అడితీలు నుంచి సీఐటీయూ జెండా వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి దండా లక్ష్మీనారాయణ, గుంటూరు నగర ముఠా వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కే శ్రీనివాసరావులు మాట్లాడుతూ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ముఠా మేస్త్రీలు బండి వెంకటేశ్వర్లు, ఉమర్ బాష, హుస్సేన్, హసన్, వలి, జానీ, రమణయ్య పాల్గొన్నారు.

టిఫిన్ సెంటర్లు, పానీపూరి బండ్లు మూసివేయండి



నెహ్రూనగర్: గుంటూరు నగరంలో డయేరియా, కలరా కేసులు రావడంతో మున్సిపల్ సిబ్బంది ఆయా ప్రాంతాల్లో టిఫిన్ బండ్లు, పానీపూరి బండ్లు మూసివేయాలని చెబుతున్నారు. ప్రగతినగర్, సుద్దపల్లిడొంక, యాదవులబజార్, బాలాజీనగర్, రామిరెడ్డితోట, సీతారామ్‌నగర్, నెహ్రూనగర్, ఆర్టీసీ కాలనీలో డయేరియా కేసులు నమోదయ్యాయి.

కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యపు పాలనలో నిరుద్యోగులకు కష్టాలు తప్పడం లేదు. విజ్ఞానాన్ని పెంచి జీవితాల్లో వెలుగులు నింపే సరస్వతీ నిలయం ఇప్పుడు సమస్యల కేంద్రంగా మారింది. ఇప్పటికే శిథిలావస్థకు చేరిన ప్రభుత్వ ప్రాంతీయ గ్రంథాలయం ఇటీవల వర్షాలకు చుట్టూ నీరు చేరి అధ్వానంగా తయారైంది. దీనికితోడు కాలువల పనుల కోసం తవ్విన గుంతలతో లోపలికి వెళ్లే దారి కూడా దాదాపు మూసుకుపోయింది. విద్యుత్ తీగలు తొలగించడంతో సరఫరా ఆగిపోయింది. చిమ్మచీకటిలోనే నిరుద్యోగులు, పాఠకులు చదువుకోవాల్సి వస్తోంది.

‘వెలుగులు’ నిండే దారేదీ?

- ప్రభుత్వ ప్రాంతీయ గ్రంథాలయంలో అలుముకున్న అంధకారం
- పోటీ పరీక్షల విభాగంలో వారం రోజులుగా చీకట్లు
- కాలువల నిర్మాణం కోసం విద్యుత్ తీగలను కత్తిరించిన జీఎంసీ
- విద్యుత్ సరఫరా పునరుద్ధరణకు నోచుకోక నిరుద్యోగులకు కష్టాలు
- కనీసం పట్టించుకోని మున్సిపల్, విద్యుత్, ఆర్ అండ్ బీ శాఖల అధికారులు



ప్రభుత్వ ప్రాంతీయ గ్రంథాలయం

గుంటూరు ఎడ్యుకేషన్: ఏసీ కళాశాల ఎదుట ఉన్న ప్రభుత్వ ప్రాంతీయ గ్రంథాలయం అధ్వానంగా మారింది. శతాబ్దాల క్రితం నిర్మించిన గ్రంథాలయ భవనం ఇప్పటికే శిథిలావస్థకు చేరింది. పాఠకులు, పోటీ పరీక్షల అభ్యర్థులకు కనీస సదుపాయాలు కూడా కల్పించని దుస్థితి నెలకొంది. పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యేందుకు జిల్లా నలుమూలల నుంచి ఇక్కడకు వస్తున్న నిరుద్యోగ యువతకు పోటీ పరీక్షల విభాగంలో కూర్చుని చదువుకునేందుకు అవకాశం లేకుండా పోయింది. శంకర్‌విలాస్ ఆర్వోబీ కూల్చివేత పనుల్లో భాగంగా కాలువల నిర్మాణం కోసం గుంతలు తీశారు. ఆ సమయంలో గ్రంథాలయానికి వెళ్లే విద్యుత్ తీగలను తొలగించారు. దీంతో పోటీ పరీక్షల విభాగానికి గత వారం రోజులుగా విద్యుత్ సరఫరా లేదు. అంతటా అంధకారం నెలకొంది. ఫలితంగా పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యేందుకు వచ్చే అభ్యర్థుల సంఖ్య తగ్గిపోయింది.

ఎప్పుడు కూలుతుందో...

కాలువల కోసం తీసిన గుంతలతో గ్రంథాలయంలోకి వెళ్లేందుకు సైతం మార్గం లేకుండా పోయింది.



చీకటిలోనే చదువుతున్న నిరుద్యోగులు

ఇటీవల కురుస్తున్న వర్షాలతో గ్రంథాలయ ప్రాంగణంలో భారీగా వర్షపు నీరు చేరింది. అది కదలకుండా ఉండిపోవడంతో దోమలు విజృంభిస్తున్నాయని పాఠకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శిథిలావస్థకు చేరిన భవనం కూడా ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితుల్లో ఉన్నామని వాపోతున్నారు. ప్రాంతీయ గ్రంథాలయానికి నూతన భవనాన్ని నిర్మించేందుకు కూటమి ప్రభుత్వం ఎటువంటి చర్యలూ చేపట్టడం లేదన్నారు. కనీసం మరమ్మతుల కోసమైనా పైసా విదల్చడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.



గ్రంథాలయంలోకి దారి లేకుండా తవ్విన కాలువలు

పట్టించుకోని అధికారులు

దాదాపు నలభై ఏళ్ల క్రితం భూగర్భంలో నుంచి గ్రంథాలయానికి విద్యుత్ తీగలు వేశారు. ఇప్పుడు కాలువల నిర్మాణం కోసం తవ్విన గుంతల కారణంగా అవి తెగిపోయాయి. విద్యుత్ తీగలను సరిచేసి సరఫరా పునరుద్ధరించాలని నిరుద్యోగులు, పాఠకులు కోరినప్పటికీ నగరపాలక సంస్థ, ఆర్ అండ్ బీ, విద్యుత్ శాఖల అధికారులు ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. దీనిపై గ్రంథాలయాధికారి వీఎస్ఎస్ఎన్ మూర్తిని వివరణ కోరగా, సమస్యను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు.

‘బజరంగ్’లో బాలసుబ్రహ్మణ్యంకు నివాళి



ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న అంబటి మురళీకృష్ణ తదితరులు

కొరిటిపాడు (గుంటూరు వెస్ట్): ఈ శతాబ్దపు అత్యుత్తమ నేపథ్య గాయకుల్లో ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం అగ్రస్థానంలో నిలుస్తారని, గాన గంధర్వునిగా తెలుగుజాతి ఆయన్ను గుండెల్లో పెట్టుకుందని బజరంగ్ అర్బన్ ఇన్ఫ్రా సీఈఓ అంబటి మురళీకృష్ణ పేర్కొన్నారు. పట్టాభిపురంలోని బజరంగ్ కార్యాలయంలో బాలసుబ్రహ్మణ్యం పంచమ వర్ధంతిని గురువారం నిర్వహించారు. ముందుగా బాలు చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మురళీకృష్ణ మాట్లాడుతూ.. తెలుగు సినిమా పరిణామ క్రమంలో నేపథ్య సంగీతం ఓ విప్లవాత్మకమైన మార్పు కాగా, నేపథ్య గాయకుడిగా ఎస్పీ బాలు వందల సినిమాలకు వేల పాటలు పాడటం ద్వారా అందించిన సేవలు అజరామరం అన్నారు. అద్భుత గానానికి తోడు పరిణతి చెందిన తెలుగు భాషా పరిజ్ఞానం ఎస్పీ బాలుకే సొంతమని చెప్పారు. తన మధుర స్వరంతో ఆయన అటు సినీ పరిశ్రమకు, ఇటు తెలుగు భాషను శోభాయమానం చేశారని కొనియాడారు. పలు టెలివిజన్ కార్యక్రమాల ద్వారా ఔత్సాహిక గాయనీగాయకులకు అందించిన ప్రోత్సాహంతోనే వందల మంది నూతన కళాకారులు జనించారనటం ఎంతమాత్రం అతిశయోక్తి కాదన్నారు. తెలుగుతోపాటు ఇతర దక్షిణాది భాషల్లో ఆయన అందించిన సుస్వరాల సంగీత ఝరి సినీ పరిశ్రమ ఉన్నంత కాలం వినిపిస్తూనే ఉంటుందన్నారు. కళాకారునిగా ఆయన జన్మ ధన్యమైందని చెప్పారు. ఆయనను స్మరించుకోవడం మనందరి బాధ్యత అని మురళీకృష్ణ అభివర్ణించారు. కార్యక్రమంలో బజరంగ్ డైరెక్టర్లు ఎస్.శ్రీనివాసరావు, జి.సుబ్బారావు, ఎస్.సమీర్ నందన్, ప్రాజెక్టు మేనేజర్ దుర్గై, సిబ్బంది పాల్గొన్నారు.



ఆర్.అగ్రహారం శ్రీకన్యక పరమేశ్వరి దేవస్థానంలో శ్రీపుష్పశయ్య అలంకారంలో అమ్మవారు



ఏటుకూర్ రోడ్డులోని శ్రీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో కాత్యాయనిగా అమ్మవారు

– నగరంపాలెం

వైద్య రంగంలో ఫార్మసిస్టుల పాత్ర కీలకం



ర్యాలీలో పాల్గొన్న డాక్టర్ యశస్వి రమణ, డాక్టర్ సుందరాచారి తదితరులు

గుంటూరు మెడికల్: ప్రపంచ ఫార్మసిస్టుల దినోత్సవం సందర్భంగా గురువారం గుంటూరు జీజీహెచ్ ఫార్మసీ సిబ్బంది, ఏపీ ఫార్మసిస్ట్ అసోసియేషన్ గుంటూరు జిల్లా కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో ర్యాలీ జరిగింది. జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ యశస్వి రమణ, గుంటూరు వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.వి.సుందరాచారి ముఖ్య అతిథులుగా ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఫార్మసిస్టులు వైద్య రంగానికి వెన్నుముక లాంటి వారన్నారు. జీజీహెచ్ నుంచి జిల్లా పరిషత్ మీటింగ్ హాలు వరకు ర్యాలీ కొనసాగింది. అక్కడ ప్రాంతీయ వైద్య ఆరోగ్య శాఖ సంచాలకులు (ఆర్డీ) డాక్టర్ జి.శోభారాణి ముఖ్య అతిథిగా మాట్లాడారు. అనంతరం ఆమెను యూనియన్ నేతలు సత్కరించారు. యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.మహిధర్, వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ జైనాబీ, గుంటూరు జిల్లా అధ్యక్షులు జయలక్ష్మి, ప్రధాన కార్యదర్శి వి.మురళీకృష్ణ, కోశాధికారి చంద్రన్న, అసోసియేట్ ప్రెసిడెంట్ కె.లక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.

బాలకృష్ణను మించిన సైకో మరొకరు లేరు

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి గులాం రసూల్

నెహ్రూ నగర్: సినీ నటుడు, తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే బాలకృష్ణను మించిన సైకో రాష్ట్రంలో మరొకరు లేరని, ఆయనకు ఇప్పటికే మెంటల్ సర్టిఫికెట్ కూడా ఉందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి గులాం రసూల్ గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అసలు జనంలోకి వస్తే సైకోలా వ్యవహరించేదెవరో అందరికీ తెలుసని మండిపడ్డారు. వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ అధినేత వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డిపై బాలకృష్ణ చేసిన అనుచిత వ్యాఖ్యలను ఆయన తీవ్రంగా ఖండించారు. బాలకృష్ణ నోరు అదుపులో పెట్టుకుంటే మంచిదన్నారు. బెల్లంకొండ సురేష్‌పై కాల్పులు జరిపిన కేసులో మెంటల్ సర్టిఫికెట్ తెచ్చుకుని ఆ కేసు నుంచి బాలకృష్ణ బయటపడిన సంగతి రాష్ట్ర ప్రజలందరికీ తెలుసన్నారు. ఆయన మానసిక స్థితి సరిగాలేదని, వెంటనే ఆసుపత్రిలో చూపించుకోవడం మంచిదన్నారు.

పండిట్ దీన్ దయాళ్‌కు నివాళి



కార్యక్రమంలో పాల్గొన్న బీజేపీ నేతలు

గుంటూరు మెడికల్: భారతీయ జనతా పార్టీ సిద్ధాంతకర్త పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ జయంతి వేడుకలు గురువారం గుంటూరు జేకేసీ కాలేజ్ మౌర్య ఫంక్షన్‌హాలులో జరిగాయి. బీజేపీ జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్సీ సోము వీర్రాజు విచ్చేశారు. పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ చిత్రపటానికి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో చివరి వ్యక్తి వరకు అభివృద్ధి ఫలాలు చేరాలని పండిత్ దీన్ దయాళ్ సూచించారన్నారు. ఆ దిశగా ప్రధాని నరేంద్ర మోదీ పయనిస్తున్నారని పేర్కొన్నారు. సమావేశంలో బీజేపీ సీనియర్ నాయకుడు జూపూడి రంగరాజు, రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి వల్లూరు జయ ప్రకాష్ నారాయణ, అధికార ప్రతినిధి దర్శనపు శ్రీనివాస్, పార్లమెంట్ కన్వీనర్ భీమినేని చంద్రశేఖర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు యడ్లపాటి స్వరూపారాణి, ఈదర శ్రీనివాసరెడ్డి, జిల్లా ఇన్‌చార్జులు కొక్కెర శ్రీనివాస్ యాదవ్, గాజుల వెంకయ్య నాయుడు, సీనియర్ నాయకుడు కొత్తూరు వెంకట సుబ్బారావు, కార్యక్రమ కన్వీనర్ చరక కుమార్ గౌడ్, పాలపాటి రవికుమార్, బ్రాహ్మణ రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్ వెలగలేటి గంగాధర్, వై.వి. సుబ్బారావు, జిల్లా ప్రధాన కార్యదర్శులు బజరంగ్ శ్రీనివాస్, దేసు సత్యనారాయణ, తోట శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



పట్నంబజారు: పట్నంబజారులో పలు ప్రధాన ఆలయాలు ఉన్న నేపథ్యంలో దసరా వేడుకలను పురస్కరించుకుని వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని ఈస్ట్ ట్రాఫిక్ సీఐ ఎ.అశోక్‌కుమార్ సూచించారు. గురువారం హిమని కూల్‌డ్రింక్ సెంటర్ నుంచి ఏటుకూరు రోడ్డు మూడు బొమ్మల సెంటర్ వరకు అడ్డగోలుగా పార్కింగ్ చేసిన వాహనాలు పక్కకు తొలగించారు. చిరు వ్యాపారులు ట్రాఫిక్‌కు అంతరాయం కలుగకుండా వ్యాపారాలు చేసుకోవాలని సూచించారు. నిర్దేశిత పార్కింగ్ ప్రదేశాల్లో వాహనాలు పెట్టుకోవాలని తెలిపారు. ఉదయం సమయంలో భారీ వాహనాలకు అనుమతి లేదన్నారు. పందిళ్లు వేసి ఉత్సవాలు జరుగుతున్న నేపథ్యంలో కన్యకా పరమేశ్వరి ఆలయం వైపు వచ్చే వాహనదారులు జాగ్రత్తలు పాటించాలన్నారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే చట్టప్రకారం కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈస్ట్ ట్రాఫిక్ పోలీసు స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

దసరా వేడుకల్లో అలరించిన చిన్నారులు



నవ దుర్గల వేషధారణలో విద్యార్థినులు



చిన్నారులతో జనార్దన్ రెడ్డి, సుశీల

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యానగర్లోని స్టెమ్ పాఠశాలలో గురువారం నిర్వహించిన దసరా వేడుకల్లో విద్యార్థినులు నవ దుర్గల వేషధారణలో అలరించారు. ఈ సందర్భంగా దసరా పండుగ విశేషాలను నిర్వాహకులు వివరించారు.

ఆకట్టుకున్న చిన్నారుల వేషధారణ

ఏటీ అగ్రహారం, పట్టాభిపురంలోని జీకేఆర్ హైస్కూల్ క్యాంపస్‌లలో గురువారం దసరా సంబరాలను జరుపుకొన్నారు. ఈ సందర్భంగా చిన్నారులు నవ దుర్గల వేషధారణలో అలరించారు. పాఠశాల డైరెక్టర్లు జి.కొండారెడ్డి, జనార్దన్ రెడ్డిలు మాట్లాడుతూ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించే పండుగ దసరా అన్నారు. చేపట్టిన పనిలో విజయాన్ని సాధించేందుకు అమ్మ వారిని ప్రార్థించాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా నవ దుర్గల వేషధారణలోని విద్యార్థినులు ప్రదర్శించిన నృత్య రూపకం ఆకట్టుకుంది. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శైలజ, సుశీల, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బడి ప్రాంగణంలో చెత్త తొలగింపు

కొరిటిపాడు: ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్ ఆధ్వర్యంలో మెగా శుభ్రతా కార్యక్రమం గురువారం నిర్వహించారు. బ్రాడీపేటలోని ఎల్ఈఎం హైస్కూల్ ప్రాంగణంలో సుమారు 120 మంది బ్యాంక్ సిబ్బంది వ్యర్థాలు శుభ్రం చేశారు. స్వల్ప మరమ్మతు పనులు చేపట్టారు. మొక్కలు నాటారు. బ్యాంక్ చైర్మన్ కె. ప్రమోద్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ జీవితంలో స్వచ్ఛత ప్రాముఖ్యతను వివరించి, విద్యార్థులకు అవగాహన కల్పించారు. అది సమాజం, దేశాభివృద్ధికి తోడ్పడుతుందన్నారు. బ్యాంక్ జనరల్ మేనేజర్‌లు పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గింపు ప్రయోజనాలపై సదస్సు



మాట్లాడుతున్న లంకా దినకర్

గుంటూరు మెడికల్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జీఎస్టీ సంస్కరణల ప్రభావం వల్ల ప్రయోజనాలు, దేశ ఆర్థిక వ్యవస్థపై సానుకూల ప్రభావంపై గురువారం గుంటూరు నగరంలో అవగాహన సదస్సు జరిగింది. బీజేపీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా 20 సూత్రాల కార్యక్రమాల అమలు చైర్మన్ లంకా దినకర్ హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ... జీఎస్టీ తగ్గింపు ప్రయోజనాలను వినియోగదారులకు అందించాల్సిన బాధ్యత వ్యాపారులపై ఉందన్నారు. జీఎస్టీ అధికారులు, వినియోగదారుల కమిషన్‌లు పర్యవేక్షించాలని కోరారు. దేశంలోని 90 శాతం కుటుంబాలకు కొనుగోలు శక్తి పెరుగుతుందన్నారు. బీజేపీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి వల్లూరు జయ ప్రకాష్ నారాయణ మాట్లాడుతూ మోదీ నిర్ణయంతో దేశ ఆర్థిక రంగం పరుగులు పెడుతుందన్నారు. జీఎస్టీ సూపరింటెండెంట్ నాగేశ్వరావు, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు యేల్చూరి వెంకటేశ్వర్లు, ప్రముఖ న్యాయవాదులు జూపూడి రంగరాజు, భీమినేని చంద్రశేఖర్, డాక్టర్ రాధ మాధవి, దర్శనపు శ్రీనివాస్, స్వరూపారాణి, శ్రీనివాసరెడ్డి, కొక్కెర శ్రీనివాస్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

విలువలతో కూడిన విద్యాబోధనకు అంకితం



విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న కళాశాల ప్రతినిధులు

గుంటూరు ఎడ్యుకేషన్: నైతిక విలువలతో కూడిన విద్యాబోధనకు బాపూజీ కమిటీ విద్యాసంస్థలు అంకితమై పని చేస్తున్నాయని బాపూజీ కమిటీ కార్యదర్శి కర్పూరపు రామకృష్ణప్రభు పేర్కొన్నారు. గురువారం సంగడిగుంటలోని గుంటూరు చలమయ్య-కర్పూరపు వెంకట నారాయణ డిగ్రీ కళాశాలలో ఫ్రెషర్స్ డే నిర్వహించారు. ముఖ్య అతిథిగా రామకృష్ణ ప్రభు మాట్లాడుతూ 1958లో బాపూజీ కమిటీగా ఏర్పడిన విద్యాసంస్థ దినదినాభివృద్ధి చెంది, 1999లో డిగ్రీ స్థాయి వరకు విస్తరించడం గొప్ప విషయమన్నారు. కార్పొరేట్ విద్యాసంస్థలతో పోటీపడుతూ విద్యార్థులకు కాలానుగుణంగా నాణ్యమైన విద్య అందిస్తున్నామని తెలిపారు. కళాశాల పాలకవర్గ అధ్యక్షుడు పచ్చిపులుసు రాఘవరావు మాట్లాడుతూ జీవితంలో స్థిరపడేందుకు డిగ్రీ దోహదం చేస్తుందని చెప్పారు. తల్లిదండ్రుల ఆశలు వమ్ము చేయకుండా విద్యావంతులుగా ఎదగాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం ఆటల పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కళాశాల కార్యదర్శి కర్పూరపు సూర్యనారాయణమూర్తి, ప్రిన్సిపాల్ మహంకాళి శ్రీనివాసరావు, అధ్యాపకులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

దంత సమస్యలపై నిర్లక్ష్యం తగదు



మాట్లాడుతున్న డాక్టర్ విద్య

గుంటూరు మెడికల్: శరీరంలో కీలకమైన దంతాల పరిరక్షణకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వ ఆరోగ్య పథకం (సీజీహెచ్ఎస్) సీనియర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ వి.విద్య అన్నారు. స్వస్థ్ నారీ – స్వశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గురువారం నగరంపాలెంలోని సీజీహెచ్ఎస్ వెల్‌నెస్ కేంద్రంలో అమరావతి డెంటల్ హాస్పిటల్ సౌజన్యంతో ఉచిత దంత పరీక్షలు నిర్వహించారు. డాక్టర్ విద్య మాట్లాడుతూ.. దంత సమస్యల పట్ల నిర్లక్ష్యం వహిస్తే, అది ఇతర వ్యాధులకు దారితీయవచ్చున్నారు. దంత సంరక్షణ తరచూ వైద్యుల సమక్షంలో జరిగితే, భవిష్యత్తులో అనర్థాలను నివారించవచ్చని తెలిపారు. అమరావతి డెంటల్ హాస్పిటల్ డాక్టర్లు సౌమ్య, కీర్తిలు మాట్లాడుతూ దంత సమస్యలకు పలు ఆధునిక చికిత్స విధానాలు అందుబాటులోకి వచ్చాయన్నారు. కార్యక్రమంలో సీజీహెచ్ఎస్ లోకల్ అడ్వైజరీ కమిటీ మెంబర్ గుమ్మడి సీతారామయ్య చౌదరి, సీనియర్ నర్సింగ్ ఆఫీసర్ బి. హేమా సుందరి, జాన్‌బీ, ఫార్మాసిస్టులు అయేషా, సునీల్, మురళీ కృష్ణ, రామారావు, మోహన్, మక్బుల్, రత్నరాజు, వెంకటేశ్వర్లు, నందమణి పాల్గొన్నారు.

సాహితీలోకంలో జాషువాకు ప్రత్యేక స్థానం



మాట్లాడుతున్న విల్సన్

నగరంపాలెం: తెలుగు నుడికారానికి గుడి కట్టిన కవి గుర్రం జాషువా, తెలుగు సాహితీలోకంలో ఆయనకు ప్రత్యేక స్థానం ఉందని తెలుగు, సంస్కృత అకాడమి ఏపీ అధ్యక్షుడు ఆర్‌డీ విల్సన్ (శరత్‌చంద్ర) అన్నారు. జాషువా జయంతి వారోత్సవాల్లో భాగంగా గురువారం బ్రాడీపేట శారదానికేతన్ విద్యా సంస్థల్లో సభ నిర్వహించారు. జాషువా కల్చరల్ సెంటర్ గౌరవాధ్యక్షుడు ఎస్.బాలస్వామి అధ్యక్షత వహించారు. ఆర్‌డీ విల్సన్ మాట్లాడుతూ విశ్వనరుడిగా దేదీప్యమానంగా తెలుగు సాహితీ లోకంలో కవి జాషువా వెలుగొందారని అన్నారు. మాజీ మంత్రి డొక్కా మాణిక్యవరప్రసాద్ మాట్లాడుతూ తెలుగు భాష ఉన్నంత వరకు జాషువా కవిత్వం వర్ధిల్లుతుందని అన్నారు. జాషువా కల్చరల్ సెంటర్ అధ్యక్షుడు పోలె ముత్యం మాట్లాడుతూ జాషువా సాహిత్యంపై పిల్లల్లో అవగాహన కల్పించాలని అన్నారు. ప్రముఖ సాహితీవేత్తలు తుర్లపాటి రాధాకృష్ణమూర్తి, చిటిప్రోలు వెంకటరత్నంలను జాషువా పురస్కారాలతో సత్కరించారు. సభలో కార్యదర్శి పి.వి.రమణ, బీరం సుందరరావు, డాక్టర్ ఎం.విజయశ్రీ, శారదానికేతనం ప్రిన్సిపల్ డాక్టర్ కోటిరత్నం, కరస్పాండెంట్ టి.శ్రీనివాసరావు, న్యాయవాది చిగురుపాటి రవీంద్రబాబు పాల్గొన్నారు.

సంప్రదాయాల్లోనూ విజ్ఞానం

గుంటూరు ఎడ్యుకేషన్: జేకేసీ కళాశాల రోడ్డులోని డాక్టర్ కేఎల్పీ పబ్లిక్ స్కూల్లో గురువారం దసరా సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు నవ దుర్గల వేషధారణతో అలరించారు. పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్ మట్లాడుతూ.. హైందవ సనాతన ధర్మాలు, ఆచార వ్యవహారాలు, సంప్రదాయంలో ఎంతో విజ్ఞానం దాగి ఉందని వివరించారు. విద్యార్థులు తమ ప్రతిభ చాటేలా ప్రదర్శనలతో అలరించారు. ప్రిన్సిపాల్ జి.రత్తయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

